
సాక్షి నిజామాబాద్

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



హరహర శంభో

మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. శివునికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో ▸



పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.7/15.1

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పసుపు @ 45వేల బస్తాలు



సుభాష్‌నగర్: నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్ గంజ్ పసుపు కొమ్ముల బస్తాలతో కళకళలాడింది. సోమవారం ఒక్కరోజే 45 వేల బస్తాలను రైతులు మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. శివరాత్రి, అమావాస్య పురస్కరించుకుని మార్కెట్ కమిటీకి మంగళవారం నుంచి ఆదివారం వరకు వరుస సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పసుపు రైతులు పంట దిగుబడిని విక్రయించేందుకు పెద్ద మొత్తంలో తీసుకొచ్చారు. ఈ సీజన్‌లో ఒకేరోజు 45 వేల బస్తాలు రావడం ఇదే మొదటిసారి. పసుపునకు అత్యధికంగా రూ.12,388 ధర పలకగా, మోడల్ ధర రూ.11,050 పలికింది.

సివిల్ సప్లయీస్ డీఎంగా ఎం శ్రీకాంత్‌రెడ్డి



సుభాష్‌నగర్: పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (డీఎం)గా ఎం శ్రీకాంత్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంగా విధులు నిర్వర్తించిన అంబదాస్ రాజేశ్వర్ సంగారెడ్డికి బదిలీపై వెళ్లారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన శ్రీకాంత్‌రెడ్డికి ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు.

కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్

నిజామాబాద్‌అర్బన్: శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల విధులు నిర్వర్తించనున్న వారు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని ఎన్‌ఐసీ హాల్ (రూమ్ నంబర్ 21)లో సెంటర్ ఏర్పాటు చేసి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామన్నారు. మంగళవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని, ఒక్క రోజు మాత్రమే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల ఆర్డర్ కాపీతోపాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ బృందాన్ని నియమించడంతోపాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసినట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన 235 మందితోపాటు ఇతర జిల్లాలకు చెందిన మరో 20 మంది ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ సదుపాయం కోరుతూ ఫారం–12 ద్వారా దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు.

వైన్ షాపులు బంద్

ఖలీల్‌వాడి: శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు వైన్ షాపులు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి వైన్ షాపులు, బార్‌లు తెరిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నేడు మినీ బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లా మినీ బేస్‌బాల్ బాల, బాలికల జట్టు ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, ఎస్ వినోద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సుద్దపల్లి శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కోచ్‌లు నరేశ్, మౌనిక, జ్యోత్స్నకు క్రీడాకారులు రిపోర్టు చేయాలని సూచించారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 2013 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు.

నగరంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పట్టభద్రులు, కాంగ్రెస్ కార్యకర్తలు





అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పట్టభద్రులూ.. ఆలోచించి ఓటేయండి

- ఎమ్మెల్సీ అభ్యర్థులే దొరకని బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌ను ఓడించాలనడమేమిటి ?
- మరి ఎవరిని గెలిపించాలో ఆ పార్టీ చెప్పాలి
- ప్రజలు తిరస్కరించినా కుట్రలు మానని కేసీఆర్
- బీఆర్‌ఎస్‌కు రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హత ఉందా..
- ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: శాసనసభ ఎన్నికల్లో ప్రజల తిరస్కారానికి గురై, లోక్‌సభ ఎన్నికల్లో గుండుసున్నాతో డిపాజిట్లు కోల్పోయి, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టలేని బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఓడించాలని చెబుతోంది.. మరి ఓటు ఎవరికి వేయాలని చెబుతున్నారని అడుగుతున్నా. బీఆర్‌ఎస్ పార్టీకి రాజకీయ పార్టీగా చెప్పుకునే అర్హత ఉందా? అని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన, కీలక పాత్ర పోషించిన పట్టభద్రులు ఈ విషయమై ఆలోచన చేయాలని ఆయన కోరారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ఏం చేసిందో గమనించాలన్నారు. కేసీఆర్‌ను ఫాంహౌస్‌లో పడుకోమని జనం పంపారని, ప్రజలు తిరస్కరించినప్పటికీ కుట్రలు మానలేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రభుత్వాన్ని బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ఉద్యోగ నోటిఫికేషన్లు అరకొరగా ఇచ్చినప్పటికీ కోచింగ్ సెంటర్లతో కుమ్మక్కై కోర్టు కేసులు వేయించి నిరుద్యోగులతో ఆటలాడుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అశోక్‌నగర్, అమీర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిప్పారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కేవలం ఏడాది లోపే 51,163 మందికి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేశామన్నారు. ఇక 35 వేల మంది టీచర్ల బదిలీలు, 22 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పట్టభద్రుల కోసం ప్రధానితో కొట్లాడుతా..

తాము చెప్పేవి అబద్ధాలైతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవతలివారికి ఓటేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ పార్టీ తరఫున నిలబడిన నరేందర్ రెడ్డిని గెలిపించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. తుపాకీ గుండుకు సైతం దొరకనివారిని ఓడించాలన్నారు. నరేందర్‌రెడ్డి ఓడితే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. తాను ఒక్క గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానన్నారు. పట్టభద్రుల కోసం ప్రధాని మోదీతో నైనా కొట్లాడతానన్నారు.

ఏటా రూ.75 వేల కోట్ల వడ్డీ చెల్లింపు..

మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పగిస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7.11 లక్షల కోట్ల అప్పు చేసిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కేసీఆర్ చేసిన అప్పుకు ఏడాదికి రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతోందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్ల బకాయిలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 12 గంటల్లో సమగ్ర కుటుంబ సర్వే చేసి బీసీలు 51 శాతమే ఉన్నట్లు చూపగా, తాము కచ్చితమైన సర్వే చేసి బీసీలు 56.33 శాతం ఉన్నట్లు తేల్చామన్నారు. తీరా ఇప్పుడు లెక్క తప్పు అంటూ బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సొల్లు వాగుడు వాగుతున్నారన్నారు. మైనారిటీలు 12.56 శాతంగా తేల్చామన్నారు. ఇందులో 10.08 శాతం బీసీలున్నారన్నారు. కులగణనపై బండి సంజయ్ భావోద్వేగాలు రెచ్చగొడుతున్నారన్నారు. బీజేపీ పాలిత గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ముస్లింలు బీసీ రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ కృష్ణ మాదిగను కౌగిలించుకుని సమస్యను మాత్రం పరిష్కరించలేదన్నారు. 12 ఏళ్ల మోదీ, 10 ఏళ్ల కేసీఆర్ పాలన చూడాలని పిలుపునిచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌లో కీలక పాత్రధారులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులను అమెరికా నుంచి తీసుకురాకుండా బండి సంజయ్ బీఆర్‌ఎస్‌తో బేరం పెట్టుకున్నారన్నారు. రాష్ట్రానికి ప్రాజెక్టులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారన్నారు.



నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరుతున్న రేవంత్‌రెడ్డి

వారధిగా ఉంటా..



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానన్నారు. తనపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతున్న కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమ్మేళనంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, మదన్‌మోహన్, లక్ష్మీకాంతారావు, నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, నిజామాబాద్, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్, అన్వేష్ రెడ్డి, కాసుల బాలరాజు, ఈరవత్రి అనిల్, తాహెర్ బిన్ హందాన్, ఐకే రెడ్డి, వేణుగోపాలచారి, శ్రీహరి రావు, బాడ్సి శేఖర్‌గౌడ్, వినయ్‌రెడ్డి, కుంట రమేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, మార గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా ఐటీఐలు

రూ.2,100 కోట్లు వెచ్చించి, టాటా కంపెనీతో కలిసి ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చామని, టాటాలో ఉద్యోగాలిచ్చేలా ఒప్పందం చేసుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే మహీంద్రా గ్రూప్‌తో కలిసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పెట్టి ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా చేశామన్నారు. మంచి కంపెనీలవారిని డైరక్టర్లుగా పెట్టామన్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు తీసుకురావాలనే లక్ష్యంతో గ్రామీణ క్రీడాకారులను, మట్టిలో మాణిక్యాలను ప్రోత్సహించేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. నిఖత్ జరీన్‌కు రూ.2 కోట్ల నగదు, డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామన్నారు. ఇంటర్ మాత్రమే చదివిన క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం ఇచ్చామన్నారు. పారా ఒలింపిక్స్‌లో పతకం తెచ్చిన కీర్తికి గ్రూప్ 2 ఉద్యోగం ఇచ్చామన్నారు. పంజాబ్, హర్యానా రైతులతో పోటీపడే నిజామాబాద్ రైతుల ఉద్యమంలో పాల్గొన్న తనకు పీసీసీ పదవి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, సన్నధాన్యానికి బోనస్ ఇచ్చామన్నారు.

రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నేత



పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు తాను చూసినవారిలో మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి మాత్రమే దూరదృష్టి, విజన్, తపన, పట్టుదల ఉన్న నేతలన్నారు. రేవంత్‌రెడ్డి ధైర్యంగా ముందుకెళుతున్నారన్నారు. ఫాంహౌస్‌లో నిద్రపోతూ, రాష్ట్రాన్ని నిద్రపుచ్చే ప్రయత్నం చేసిన నాయకులు మాట్లాడడం సరికాదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ కుటుంబం ఆగం చేసిందన్నారు. 2 కోట్ల ఉద్యోగాలన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతోందన్నారు. మళ్లీ ఏముఖం పెట్టుకుని ఓట్లడుగుతున్నారన్నారు. నిజామాబాద్‌లో ఐటీ టవర్ ఉందని, అందులో ఏమీ లేదని, నిధులు ఇస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారన్నారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అన్నారు.



వేదికపై సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్ తదితరులు

అధునాతన వసతులతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్

- ఒకే సముదాయంలో అన్ని వర్గాల విద్యార్థులు
- ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్య
- వీసీలో విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అధునాతన వసతులు కల్పించి ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తెలిపారు.

ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి కే రామకృష్ణారావుతో కలిసి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెసిడెన్షియల్స్ మంజూరైన నియోజకవర్గాల్లో త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని, నాణ్యతలో రాజీపడొద్దన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లాలోని బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలకు మంజూరు లభించిందని, వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రారంభించారు.. పక్కన పెట్టారు!

- రెండు నెలలుగా నిరుపయోగం
- ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ భవనాలను ప్రారంభించిన వైద్యారోగ్యశాఖ మంత్రి
- జీజీహెచ్ నుంచి తరలని మాతాశిశు ఆస్పత్రి విభాగం
- లిఫ్టులు లేకపోవడమే ప్రధాన కారణమా!

నిజామాబాద్‌నాగారం: అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది మాతాశిశు ఆస్పత్రి (ఎంసీహెచ్) పరిస్థితి. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్ కోసం రూ. కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించారు. వీటిని గతేడాది రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఎంసీహెచ్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి రాలేదు.

అత్యాధునిక సౌకర్యాలు

ఉమ్మడి రాష్ట్రంలో వైద్యారోగ్యశాఖ మంత్రిగా ఉన్న సుదర్శన్‌రెడ్డి హయాంలో జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైంది. దీంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి భవన సముదాయంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) నూతనంగా నిర్మించిన ఏడంతస్తుల భవనంలోకి మారింది. జీజీహెచ్‌లో నిత్యం సుమారు 2 వేలకు పైగా ఓపీ నమోదవుతోంది. క్రమంగా రోగుల తాకిడి పెరుగుతూనే ఉంది. ఇందులోనే ప్రతి నెల 250 నుంచి 300 పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 8 ఎనిమిదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఎంసీహెచ్ భవనానికి రూ.15 కోట్లు, క్రిటికల్ కేర్ యూనిట్‌కు రూ.23.75కోట్లు కేటాయించి నిర్మాణ పనులను ప్రారంభించింది. చాలాకాలానికి నిర్మాణం పూర్తికాగా, ఈ భవనంలో చిన్నారులు, గర్భిణులు, మహిళలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందించేందుకు సదుపాయాలు కల్పించారు. 250 పడకలతో మాతాశిశు ఆస్పత్రిని సిద్ధం చేశారు. అత్యాధునిక సౌకర్యాలతో ఎన్‌ఐసీయూను ఏర్పాటు చేశారు. ఇక నాలుగో అంతస్తులో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.

ఒకే ఒక్క లిఫ్ట్..

వాస్తవానికి రోగులకు వైద్య సేవలందించే విషయంలో కింది నుంచి పైఅంతస్తులోకి వెళ్లేందుకు లిఫ్టులు అత్యవసరం. ఎంసీహెచ్ భవనంలో నాలుగు లిఫ్టులు అవసరం కాగా, ఒకే ఒక్క లిఫ్టును ఏర్పాటు చేశారు. మిగతా లిఫ్టులను టీఎస్ ఎంఐడీసీ (మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులే పనులు పూర్తి చేయాలని జీజీహెచ్ అధికారులు చెబుతున్నారు. కొత్తగా నాలుగు లిఫ్టుల నిర్మాణానికి సుమారు రూ.2కోట్ల నిధులు అవసరం ఉందని టీఎస్ ఎంఐడీసీ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు చెబుతున్నారు. మిగతా పనులను పూర్తి చేస్తామని సాగదీస్తున్నారని ఆరోపిస్తున్నారు.

మంత్రి ఆదేశించినా..

గతేడాది డిసెంబర్ 22న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను ప్రారంభించారు. మాతాశిశు సంరక్షణ విభాగాలను కొత్త భవనంలోకి మార్చేసి వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీచేశారు. అప్పటి సూపరింటెండెంట్ వెళ్లిపోయి నూతన సూపరింటెండెంట్‌గా శ్రీనివాస్ వచ్చి సుమారు రెండు నెలలు కావొస్తున్నా జీజీహెచ్ నుంచి స్త్రీ, పిల్లల విభాగాలను తరలించకపోవడంతో ఎంసీహెచ్ భవనం నిరుపయోగంగా మారింది.



జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ భవనం

పనులు పెండింగ్‌లో ఉన్నాయి


ప్రస్తుతం భవనంలో ఒక్క లిఫ్టు మాత్రమే ఉంది. అది కూడా సక్రమంగా పని చేయటం లేదు. నాలుగు లిఫ్టులు తప్పనిసరి అవసరం. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్, టీఎస్‌ఎంఐడీసీ అధికారులకు నివేదిక పంపించాం.. పనులు పూర్తి కాగానే వెంటనే తరలిస్తాం. – శ్రీనివాస్, సూపరింటెండెంట్, జీజీహెచ్

బడ్జెట్ రాగానే ఏర్పాటు చేస్తాం

భవన నిర్మాణంలో లిఫ్టుల ప్రతిపాదన లేదు. ఒకే ఒక్క లిఫ్టు ఉండటంతో కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తిచేయించాం. మరో 4 లిఫ్టుల కోసం ఉన్నతాధికారులకు లేఖ రాశాం. నిధులు రాగానే లిఫ్టు పనులు పూర్తిచేస్తాం.

– కుమార్, ఈఈ, టీఎస్‌ఎంఐడీసీ

వేములవాడకు ప్రత్యేక బస్సులు



ఖలీల్‌వాడి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగినన్ని బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 27 వరకు ఆర్మూర్, నిజామాబాద్–2, కామారెడ్డి డిపోల నుంచి 136 బస్సులను నడుపుతామని తెలిపారు. నిజామాబాద్ నుంచి లోంక, కామారెడ్డి నుంచి మద్దికుంట సంతాయిపేట, కొమురవెల్లి పుణ్యక్షేత్రాలకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

వేములవాడ బస్సు చార్జీలు ఇలా..

బయల్దేరే ప్రాంతం	పెద్దలకు	పిల్లలకు
నిజామాబాద్ నుంచి	రూ.270	రూ.150
ఆర్మూర్ నుంచి	రూ. 220	రూ.120
కామారెడ్డి నుంచి	రూ. 140	రూ.80

క్లుప్తంగా

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

నిజామాబాద్‌అర్బన్‌: అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. రిజర్వు బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వహించే 'ఆర్థిక అక్షరాస్యత' వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకొని లీడ్‌ బ్యాంక్‌ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేయాలని, అవగాహన ర్యాలీలు, వినియోగదారులతో ఆర్థిక అక్షరాస్యత సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్‌, నాబార్డు డీడీఎం ప్రవీణ్‌, మెప్మా పీడీ రాజేందర్‌, అభిజీత్‌ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి అదృశ్యం



నిజాంసాగర్‌ (జుక్కల్‌): మండలంలోని అచ్చంపేట ఎస్సీ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి భూయర్‌ ఓంకార్‌ అదృశ్యమయ్యాడు. ఈ నెల 22 నుంచి కనిపించకపోవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం అందించారు. ఓంకార్‌ ఇంటికి రాలేదని చెప్పడంతో సోమవారం గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ జడ్డు జనార్దన్‌ ఫిర్యాదు చేసినట్లు నిజాంసాగర్‌ ఎస్సై శివకుమార్‌ తెలిపారు.

'కబ్జా'పై విచారణ



మాక్లూర్‌: మండలంలోని మాణిక్‌బండార్‌ శివారులో ప్రభుత్వ భూమి కబ్జాపై అధికారులు సోమవారం విచారణ ప్రారంభించారు. సర్వే నంబర్‌ 61లో పానుగంటి గంగారెడ్డి అనే వ్యక్తి కొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నాడని ఈ నెల 22న మాజీ కార్పొరేటర్‌ రాయ్‌సింగ్‌ తహసీల్దార్‌ శేఖర్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన నిజామాబాద్‌ కార్పొరేషన్‌ టౌన్‌ప్లానింగ్‌ అధికారులు, తహసీల్దార్‌ శేఖర్‌ సోమవారం కబ్జా అయిన స్థలాన్ని పరిశీలించారు. కబ్జాదారుడి వద్ద ఉన్న భూమికి సంబంధించి పత్రాల్లో సర్వే నంబర్‌ 62 అని ఉండగా, సర్వే నంబర్‌ 61లోని భూమిని కబ్జా చేసినట్లు గుర్తించారు. దీంతో టీపీవో అనుపమ, ఆర్‌ఐ షఫీ, సర్వేయర్‌ కిషన్‌ నాయక్‌లు కబ్జాదారుడు గంగారెడ్డిపై మండిపడ్డారు. దీంతో జాతీయ రహదారికి పొడవునా అన్ని కబ్జాలే ఉన్నాయని ముందు వాటిని వెలికితీసి తన జోలికి రావాలంటూ కబ్జాదారుడు అధికారులతో వాదనకు దిగారు. ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో గతంలో ఓసారి సదరు వ్యక్తిని హెచ్చరించి, కబ్జా నుండి వెళ్లగొట్టినట్లు ఇరిగేషన్‌ ఏఈ దివ్యభారతి వెల్లడించారు. తదుపరి విచారణ జరిగే వరకు భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని కబ్జాదారుడికి చెప్పారు. విచారణలో మాజీ కార్పొరేటర్‌ రాయ్‌సింగ్‌, మాణిక్‌బండార్‌ గ్రామస్తులు ప్రభు, నర్సాగౌడ్‌, వినోద్‌కుమార్‌ ఉన్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా..

మాణిక్‌బండార్‌ శివారులో జాతీయ రహదారి పక్కన సర్వేనంబర్‌ 61లో కొంత ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తి ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు దిగుతాడనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇదే శివారులో తనకు ఉన్న రెండు ఎకరాల భూమి వద్ద కొంత, దాస్‌నగర్‌ కూడలి వద్ద మరికొంత ప్రభుత్వ భూమిని కబ్జాచేసి తన ఆధీనంలో తీసుకున్నాడనే విమర్శలున్నాయి. సదరు వ్యక్తి చేసిన కబ్జాలపై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నిజామాబాద్‌ జిల్లా కేంద్ర శివారులోని ఓ గార్డెన్‌లో సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున కాంగ్రెస్‌ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, వేదికపై టీపీసీసీ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌ గౌడ్‌, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ, నిజామాబాద్‌, కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్‌ శ్రీనివాస్‌ తదితరులు

హరహర శంభో



విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం



విద్యుత్‌ దీపాలంకరణలో శంభులింగేశ్వరాలయం

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు
- ఉపవాసాలతో మహాశివుడిని కొలిచేందుకు సిద్ధమైన భక్తులు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్‌కాంతుల వెలుగుల్లో శివాలయాలు

నిజామాబాద్‌ రూరల్‌: మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. శివునికి ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలోని పలు ప్రసిద్ధ శివాలయాలను అందంగా ముస్తాబు చేశారు. నిజామాబాద్‌ నగరంలోని నీలకంఠేశ్వర ఆలయం, శంభుని గుడి, మనోకామేశ్వరాలయం, బోధన్‌లోని శ్రీచక్రేశ్వరాలయం, ఆర్మూర్‌ నవనాథసిద్ధుల గుట్ట, బాల్కొండ ఖిల్లాపై ఉన్న శివాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నలుమూల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ కమిటీలు, దేవాదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి. శివాలయాల్లో ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు పూజాది కార్యక్రమాలు, జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బాల్కొండ 'ఖిల్లా' శివుడు



బాల్కొండ ఖిల్లాలోని లింగం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని పురాతన ఖిల్లాలో ఉన్న శివుడు శివ రాత్రి సందర్భంగా భక్తుల పూజలందుకోనున్నాడు. బాల్కొండను క్రీ.శ 1422లో బహుమనీ సుల్తాన్‌లు పాలించిన సమయంలో ఖిల్లాలో పెద్ద రాతిపై స్వయంభు లింగం వెలిసినట్లు చరిత్ర చెబుతోంది. లింగానికి ఎలాంటి ఆలయం లేకపోయినా.. బండరాయి శేషును తల్పం మాదిరి ఉండి, దాని కింద లింగం ఉంది. సాధారణంగా శివాలయంలో లింగం ఎదుట నందీశ్వరుడు ఉంటాడు. కానీ ఇక్కడ గుర్రం ఉంది. ఇది ఇతర శివలింగాలకు భిన్నమని, బాల్కొండను ఏలిన చివరి రాజు ఖాజా అతిఉల్లా హుస్సైనీ కూతురు సైదానాభీ నిత్యం ఈ శివలింగాన్ని పూజించేదని చరిత్రకారులు చెబుతున్నారు.

అపురూపం 'శ్రీ చక్రేశ్వర శివాలయం'



బోధన్‌రూరల్‌: ఒకప్పటి బహుధాన్యపురం నేటి బోధన్‌లో పరశురామునిచే నిర్మింపబడి మట్టికోటను చదును చేస్తుండగా బయట పడిన అపురూపమైన శ్రీ చక్రేశ్వర శివాలయం భక్తులు కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత ఆలయం ప్రసిద్ధి చెందుతోంది. ఏకచక్రపురంలో వెలిసిన ఆలయం కావడంతో అప్పటి నుంచి 'ఏకచక్రేశ్వర ఆలయం' గా పిలుస్తున్నారు. సముద్రం నుంచి తీసుకొచ్చిన సాలాగ్రామం శిలతో శివలింగాన్ని తయారుచేసి చక్రేశ్వరాలయంలో ప్రతిష్ఠించారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు, ఆలయ కమిటీ, దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. 26న తెల్లవారుజామున 4గంటల నుంచి గర్భాలయ ధర్మ దర్శనం, అభిషేకాలు, రాత్రి 9గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.



మహా శివరాత్రి సందర్భంగా ముస్తాబైన శ్రీ చక్రేశ్వర శివాలయ ప్రాంగణం

ఏర్పాట్లు చేశాం



శివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు సహకరించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలి.

– రాములు, కార్యనిర్వహణ అధికారి

పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

- మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్‌..
- మార్చి 21 నుంచి ఏప్రిల్‌ 4 వరకు టెన్త్‌ ఎగ్జామ్స్‌
- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌



అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌

నిజామాబాద్‌అర్బన్‌: పదో తరగతి, ఇంటర్మీడియట్‌ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్‌ కిరణ్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆయాశాఖల అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్‌ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్‌ 4 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతాయని వివరించారు. 36,222 మంది ఇంటర్‌ విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 57 సెంటర్‌లను, అదేవిధంగా 22,915 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా 141 సెంటర్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌కు సూచించారు. సెంటర్‌ల పరిసరాల్లో 144 సెక్షన్‌ అమలు చేయాలన్నారు. కాపీయింగ్‌కు అవకాశం లేకుండా సిట్టింగ్‌ స్క్వాడ్‌, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ బృందాలను నియమించి, కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సజావుగా పరీక్షలు జరిగేలా అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్‌, డీఐఈవో రవికుమార్‌, జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం సహాయ కమిషనర్‌ విజయభాస్కర్‌, అధికారులు పాల్గొన్నారు.

సీఎంకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

- బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి

సుభాష్‌నగర్‌: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతికహక్కు లేదని నిజామాబాద్‌ అర్బన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని, పట్టభద్రులను మోసం చేసేందుకే జిల్లాకు వచ్చారని ఆరోపించారు. 15 నెలల కాంగ్రెస్‌ పాలనలో ఏ ఒక్కనాడైనా పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో మాట్లాడారా అని నిలదీశారు. నరేందర్‌రెడ్డి గెలిచినా.. ఓడినా తనకేం సంబంధం లేదన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం వింటే కాంగ్రెస్‌ అభ్యర్థి ఓటమిని రాజకీయంగా ఒప్పుకున్నట్లే ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ పటేల్‌ కులాచారి ఎద్దేవా చేశారు. సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌ పల్లె గంగారెడ్డి, నాయకులు ఆకుల విజయ, స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కొండా ఆశన్న, గంగాధర్‌, బద్దం కిషన్‌, నాగరాజు, విజయ్‌ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనులపై ఉక్కుపాదం



- జిల్లాపై పోలీస్‌బాస్‌ సింధుశర్మ ఫోకస్‌
- ఇసుక అక్రమ రవాణా కట్టడిపై దృష్టి
- డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులతో వాహనదారుల్లో మార్పులు
- పోలీస్‌ స్టేషన్‌లలో 'చిల్డ్రన్స్‌ పార్కులు'
- మహిళా కానిస్టేబుళ్లతో 'క్యూఆర్‌టీ'
- పీఎస్‌ల అప్‌గ్రేడేషన్‌కు ప్రతిపాదనలు
- నాలుగు నెలల్లోనే 'ఇందూరు'పై తనదైన మార్క్‌

31 కేసులు నమోదు

కమిషనరేట్‌ పరిధిలోని నిజామాబాద్‌ , ఆర్మూర్‌, బోధన్‌ సబ్‌ డివిజన్‌లలో ఇసుక అక్రమ రవాణాపై ఇన్‌చార్జి సీపీ సీరియస్‌గా ఉన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసినా, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకునేలా పోలీసులను ఆదేశించారు. దీంతో మంజీర, పెద్దవాగు, కప్పలవాగు వంటి ప్రాంతాల నుంచి ఇసుక అక్రమరవాణాకు బ్రేక్‌ పడింది. ఇసుక దందాకు సహకరించిన ఒకరిద్దరు ఎస్సైలకు గట్టిగా వార్నింగ్‌ సైతం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలో ఇసుక అక్రమ రవాణా చేసిన వారిపై 31 కేసులు నమోదయ్యాయి. మరోవైపు ఇసుక తరలింపుపై పొలిటికల్‌ ఒత్తిడి ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించినట్లు చర్చ జరుగుతోంది.

ఖలీల్‌వాడి: ఫ్రెండ్లీ పోలీసింగ్‌..మహిళల రక్షణకు ప్రాధాన్యం.. కేసుల సత్వర పరిష్కారం.. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతూ నాలుగు నెలల్లోనే తనదైన ముద్రవేసుకున్నారు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ. పాలనలో తన మార్క్‌ సంస్కరణలతో ముందుకుసాగుతున్నారు. అనతికాలంలోనే 3,600 పైగా కేసులను పరిష్కరించారు. ఒకవైపు కామారెడ్డి ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే తనదైన శైలిలో ప్రత్యేకత చాటుకుంటున్నారు.

కేసుల పరిష్కారానికి చర్యలు

నిజామాబాద్‌ సీపీ కల్మేశ్వర్‌ బదిలీ తర్వాత గతేడాది అక్టోబర్‌ 23న కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాదిలో జిల్లాలో 12వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల పరిష్కారానికి సీపీ దృష్టి సారించి సిబ్బందికి సూచనలనందించారు. లోక్‌ అదాలత్‌లో 3600 కేసులను పరిష్కరింపజేశారు. మిగిలిన కేసులను సైతం పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌ కేసుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించే ఎస్సైలపై సీరియస్‌ అయినట్లు తెలిసింది.

పీఎస్‌లలో చిన్నారులకు పార్క్‌

చిన్నారుల్లో పోలీసులంటే భయాందోళన ఉంటుంది. ఏదైనా సందర్భంలో పీఎస్‌కు మహిళలతోపాటు వచ్చే చిన్నారులు ఇబ్బంది పడకుండా స్టేషన్‌లోనే పార్కును ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటికే కామారెడ్డిలోని నాలుగు పీఎస్‌లలో చిల్డ్రన్స్‌ పార్కులను ఏర్పాటు చేయగా అవి సత్ఫలితాలివ్వడంతో నిజామాబాద్‌ కమిషనరేట్‌ పరిధిలో కూడా అమలుకు యోచిస్తున్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలతో సత్ఫలితాలు

రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా మద్యం తాగి వాహనాలు నడపడమే కారణమని భావించి ప్రతి పీఎస్‌ పరిధిలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షలు చేసి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో గతేడాది అక్టోబర్‌ నుంచి జనవరి వరకు 4,500 కేసులు నమోదు చేయగా అందులో 123 మందికి జైలు శిక్ష పడింది. మద్యం తాగినడపడంతో జైలుకు పోవాల్సి వస్తుందనే భయంతో చాలా మంది డ్రంకెన్‌ డ్రైవ్‌కు నో చెబుతున్నారు. ఇదే డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్షల ద్వారా చోరీ అయిన వాహనాలు సైతం పట్టుబడుతుండటం విశేషం.

ట్రాఫిక్‌ పీఎస్‌లకు..

కమిషనరేట్‌ పరిధిలోని అర్బన్‌లో మహిళా పోలీస్‌ స్టేషన్‌తోపాటు ఆరు పీఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుత డివిజన్‌ కార్యాలయాన్ని అర్బన్‌కు కేటాయించి నిజామాబాద్‌ రూరల్‌ డివిజన్‌ ఏర్పాటుకు డీజీపీకి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలోని 17 పీఎస్‌లను అప్‌గ్రేడ్‌ చేసి సీఐ స్థాయి అధికారుల నియామకం, కొత్తగా ఏర్పడిన మండలాల్లో పీఎస్‌లు, ఆర్మూర్‌, బోధన్‌లలో ట్రాఫిక్‌ పీఎస్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు.

క్విక్‌ రియాక్షన్‌ టీం

జిల్లాలోని మహిళా కానిస్టేబుళ్లలతో ప్రత్యేకంగా రెండు క్విక్‌ రియాక్షన్‌ టీములను ఏర్పాటు చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తిన ప్రాంతాలకు టీములు చేరుకొని పరిస్థితులను అదుపులోకి తెచ్చేలా తర్ఫీదునిచ్చారు. రద్దీ ప్రాంతాల్లో తనిఖీలకు ఈ బృందాలు సహకరించనున్నాయి. పోలీసులకు అత్యవసర పరిస్థితుల్లో డ్రైవింగ్‌ అవసరమని గుర్తించి శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే 60మంది పోలీసు సిబ్బందికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చారు.

క్రైం కార్నర్‌

చెరువులో పడి బాలుడు మృతి



ఇందల్వాయి: పశువులను మేపేందుకు వెళ్లి చెరువులో పడి బాలుడు మృతి చెందిన ఘటన లోలం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం బేల్య తండాకి చెందిన బావత్‌ చిన్నా(16) తండ్రి రాములతో కలిసి పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. తండ్రి గమనించకపోవడంతో నీటమునిగి చిన్నా చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం సుంకిని శివారు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోటగిరి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



ఎడపల్లి(బోధన్‌): ఎడపల్లి మండలంలోని బాపూనగర్‌ గ్రామానికి చెందిన కట్కూరి రాములు(40) అశోక్‌సాగర్‌లో సోమవారం శవమై తేలాడు. వివరాలు ఇలా.. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాములు.. తిరిగి రాకపోవడంతో భార్య నాగజ్యోతి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అశోక్‌సాగర్‌ గ్రామస్తుల సమాచారంతో ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, రాములు మృతదేహాన్ని బోధన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్థిక ఇబ్బందులతోనే రాములు అశోక్‌సాగర్‌లో పడినట్లు భార్య నాగజ్యోతి ఫిర్యాదులో పేర్కొంది. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

సుంకెట్‌లో ఈతవనం దగ్ధం

- కాలిపోయిన 800 ఈత చెట్లు
- రూ.10లక్షల మేర నష్టం



సుంకెట్‌లో దగ్ధమైన ఈత వనం

మోర్తాడ్‌(బాల్కొండ): మండలంలోని సుంకెట్‌లో ఈత వనం అగ్నికి ఆహుతి అయ్యింది. ప్రమాదమో లేక ఎవరైనా గిట్టనివారి కుట్రనో తెలియదు కానీ సుమారు 800ల ఈత చెట్లు సోమవారం కాలిపోయాయి. ఒక్కో చెట్టు ద్వారా ఆదాయం వచ్చే మార్గం మూసుకపోయి రూ.10లక్షల వరకు నష్టం ఏర్పడినట్లు గీతా పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు తెలిపారు. బీడు భూములు, వ్యవసాయ క్షేత్రాల్లోని ఈత చెట్లు అంతరించడంతో గీత కార్మికులు తమకున్న మూడున్నర ఎకరాల భూమిలో ఈతవనాన్ని అభివృద్ధి చేశారు. ఇటీవలే కల్లు గీయడం కోసం చెట్లను సైతం సిద్ధం చేశారు. ఈతవనం దగ్ధంపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుంకెట్‌ గీత కార్మికుల సంఘం ప్రతినిధులు ఎక్సైజ్‌ సీఐ గుండప్పకు ఫిర్యాదు చేశారు.

ఆటోనగర్‌లో కత్తులతో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఆటోనగర్‌ నయా బ్రిడ్జి వద్ద ఆదివారం రాత్రి కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. తన బంధువైన మహిళను వేధిస్తున్నారని సాథ్‌ ఫారూఖీ అనే వ్యక్తి ముగ్గురు స్నేహితులతో కలిసి నయా బ్రిడ్జికి చెందిన అక్బర్‌ ఇంటికి వెళ్లాడు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో అక్బర్‌ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి ఫారూఖీపై దాడి చేశాడు. తీవ్ర గాయాలవ్వడంతో ఆస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రుద్రూర్‌: వర్ని పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మోస్రా మండలం గోవూర్‌ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. టీవీఎస్‌ వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా బోధన్‌ మండలం భవానీపేట్‌ గ్రామానికి చెందిన మాగిరి లింగారాం (58)గా భావిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం



నిజామాబాద్‌ అర్బన్‌: ఎలక్షన్‌ కోడ్‌ తరువాత ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తామని తెలంగాణ గెజిటెడ్‌ ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్‌ భవనంలో సోమవారం టీజీవో నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. టీజీవో జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన అలుక కిషన్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో టీజీవో ఉద్యోగులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రావు, దేవీసింగ్‌, స్వామి, రామస్వామి, గెజిటెడ్‌ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

మాచారెడ్డి: లచ్చాపేట శివారులో సీజ్‌చేసిన 10 ట్రాక్టర్ల ఇసుకకు సోమవారం తహసీల్దార్‌ శ్వేత ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన గాండ్ల వినోద్‌ రూ.19వేలకు ఇసుకను దక్కించుకున్నారు. డీటీ భిక్షపతి, సీనియర్‌ అసిస్టెంట్‌ రామక్రిష్ణ పాల్గొన్నారు.